స్కెచ్

# దారి తెలియని అగతికుడు

ద్రోణంరాజు కృష్ణమోహన్

మాయమైపోయాడంటే మాయమైపోయాడన్నారు వూళ్ళో బంధువులు మిత్రులు. వెనకటి రోజు సాయంత్రం ఆఫీసుకు వెళ్ళిన గుమాస్తా గోవిందం మళ్ళా ఆ రాత్రి కాదు కదా, మరునాడు కూడా పొద్దున పదింటిదాకా ఎక్కడా పత్తా లేడు. బహుశ ఏ వూరయినా ఆఫీసు పనిమీద వెళ్ళాడేమోనని భార్య, పక్కయింటి పెద్దమనిషి రామకృష్ణయ్య ఆఫీసుకు వెళ్ళి కనుక్కుంటే "ప్రతిమా డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ" మేనేజరు నాగయ్య "మాకేం తెలుసు? ప్రస్తుతం మా సినిమా లేవీ బైట వూళ్ళో తిరగడం లేదు. అందుకని "రిప్రెజెంటేటివ్"ని పంపలేదు. ఇవాళ ఆఫీసుకు గూడా రాలేదు" అని ఎంతో వినయంగా చెప్పాడు. మిగతా గుమాస్తా లిద్దరు కూడా నాగయ్య వంక ఒకసారి చూచి 'అంతే"నన్నట్టుగా తలలూపారు.

గుమాస్తా గోవిందం సంగతి యేమయిందోనని ఆ పెద్దమనిషి ఆయన భార్య గోవిందం భార్య అంతా దిగులుగా ఏమీ తోచక అరుగు మీద కూర్చున్నారు. చుట్టుపక్కల ముసలమ్మలు, కాసేపు సావిత్రమ్మను అంటే గోవిందం భార్యను ఓదార్చి నెమ్మదిగా చెవిదగ్గర "ఏమే, నీ మొగుడికి ఏమైనా అటువంటి గుణాలున్నాయా ఏమిటి? అంటే, ఎవరితోనో .." అనేటప్పటికి, సావిత్రమ్మ కళ్ళనీళ్లు పెట్టుకుని "ఛ, ఛ, అటువంటివారు కాదండి. ఇద్దరి పిల్లల తండ్రి అయి, అందులో పూటకు గతి లేని ఆయన అలాంటి పని చేసి వుంటాడని అంటానికి మీకు నోరు ఎలా వచ్చిందండీ బామ్మగారూ?" అంటూ దీనంగా చూసింది. ఇక జారుకున్నారు పెద్దలు.

ప్రొద్దెక్కింది. ఇంకా భర్త రాకపోవటం చూసి సావిత్రమ్మ తండ్రికి మామగారికి, టెలిగ్రాము లిప్పించింది. భర్త ప్రాణ స్నేహితు లిద్దరంటే వాళ్లనుగూడా అడిగింది కాని 'మాకు తెలియదంటే తెలియద'న్నారు. ఇంటికి వచ్చేసి పిల్లలకన్నం పెట్టి తను పడుకుంది. రెక్కల మీదనే పూర్తిగా ఆధారపడే గుమాస్తా గోవిందం యింట్లో పస్తులకేం లోటు?

మధ్యాహ్నం పన్నెండవుతుంది. ఎండ నిప్పులు చెరుగుతోంది. ఎవరో నెమ్మదిగా తలుపు బాదుతున్నట్టు, కాదు గీరుతున్నట్టనిపించింది. సావిత్రి లేచి "కుక్క కాబోలు" ననుకుని మళ్ళీ పడుకుంది. అయిదునిమిషాలు గడిచాయి. మళ్లీ అదే శబ్దం. సావిత్రి లేచి తలుపు తీసింది. తన భర్త గుమ్మానికి అడ్డంగా పడుకుని వున్నాడు. చూచింది తన భర్త నమ్మలేకపోయింది. తలకు కట్టు కట్టినట్టుగా వుంది. అక్కడక్కడ రక్తపుమరకలు బాగా కనిపిస్తున్నాయి. దవడలు పీక్కుపోయాయి. బలహీనంగా వున్నాడు "ఇదేమిటండీ" అని మాత్రం అనగలిగి మీదపడి యేడవటం ప్రారంభించింది. కొద్దిగా కన్ను తెరచి. సావిత్రి నోరు నొక్కాడు గోవిందం. లోపలికి లేవదీసుకు వెళ్ళి పడుకోబెట్టింది. కట్టు విప్పింది. బలమైన గాయాలు. జాంబక్ తెచ్చి రాచింది. చెంప మీద అయిదువేళ్ళూ తేలినట్టు చక్కగా కనిపిస్తోంది. ఏడుపు మింగుతూ కళ్ళనీళ్లు కారుస్తూ, వేడినీళ్ళ కాపు కాచింది తలంతా. ఆ బట్టలు మురికి కంపుకొడుతున్నాయి. విప్పించేసి ఒక లుంగీకట్టి తువ్వాలు భుజంమీద వేసి, తల తన తొడమీద పెట్టుకుంది కన్నీరు కారుస్తూ.

ఒక అరగంట గడిచింది, కొద్దిగా మాట్లాడాడు. "ఏమిటండీ యీ ఖర్మ మనకి? నిన్న సాయంత్రం వెళ్ళారు. ఇప్పుడొచ్చారు. ఈ దెబ్బలేమిటి? ... అదేమిటి నడుం కదల్చలేక పోతున్నారు. చెప్పా?" బ్రతిమాలుతూ అడిగింది. కాస్త సర్దుకుని "ఆఁ ఏమీ లేదు. ఇక నువ్వు పడుకో. కాస్త ఆ బత్తాయిపండు వొలిచియ్యి" అని అది తిని వొక ప్రక్కకు తిరిగి పడుకున్నాడు. సావిత్రి ఇక ఆపైన అడగలేదు. అడిగితే కస్సుమంటాడని తెలుసు.

పడుకున్నాడేగాని, నిద్ర రావటంలేదు. ఆలోచనలు పరుగెత్తుతున్నాయి. తను సినిమా రిప్రజెంటేటివ్‌గా ఎందుకు చేరాడు? తను యెంత మంచి పేరు సంపాదించాడు. యీ యేడాదిలో జరిగిన ఘటన మళ్లీ తలచుకున్నాడు. నిన్న సాయంత్రం మేనేజరు చేతిలో అలా బలమైన దెబ్బలు ఎందుకు తిన్నాడు? తను డబ్బు తినలేదని ఎంత మొత్తుకున్నా, "గుమాస్తా ముండా కొడుకుల కున్న రోగమే యిది. తెగ లంచాలు తింటారు హోటలు వాళ్ళతో కలిసి." అని తిడుతూ తను ఆఫీసులో అడుగు పెట్టగానే నాగయ్య రపీమని బాదాడు వీపుమీద. తను తలెత్తి మానేసరికి, "అలా చూస్తావేంరా, దొంగ ముండాకొడుకా! నన్నుతంతావా యేం?" అని చెంపమీద బలంగా వేశాడు. ఐదు వేళ్లూ ముద్రపడ్డాయి. తను చెయ్యి దూరంగా తోసేటప్పటికే, నెత్తిమీద కుర్చీతో బలంగా వొక్క దెబ్బ వేశాడు మేనేజరు. అంతే...యిక తన కేమీ గుర్తులేదు. లేచి చూసుకునే సరికి గొల్లపూడికి దూరంగా, కృష్ణానది గట్టు వెంబడి ఒక తుమ్మ చెట్టు కింద గోతిలో పడివున్నాడు. ఒంటిమీద రక్తపుమరకలు తలమీద గాయాలు. అలాగే నీరసంగా నాలుగు గంటలసేపు కొళ్ళీడ్చాడు మూడు మైళ్లు నడవటానికి.

ఇప్పుడు ఉద్యోగం యెలాగో పోతుంది. పోకపోతే తనే మానేస్తాడు. మానితే, భుక్తి సంగతి? పోనీ కోర్టులో దావా వేస్తే క్రిమినలుగా? తింటానికి లేకపోతే దావా ఎలా? ఎనిమిదో నెల దాటిన భార్యకు త్వరలో అను పత్రి ఖర్చులు ఎక్కడినుంచి వస్తాయి? గోవిందం తనకు తెలియకుండానే ఏడుస్తున్నాడు చప్పుడు లేకుండా! ఎప్పుడూ దమ్మిడీ తినని తనని, మేనేజరు అకారణంగా చావబాదాడు. గోవిందానికి దుఃఖం పొర్లుకొచ్చింది. అసలు గుమాస్తాగా యెందుకు పుట్టాడు? ఏ కార్మికుడుగానో పుట్టివుంటే ఎంత బాగుండేది? సమ్మె చేయవచ్చు. లాంగ్ దీయవచ్చు. ఏ పార్టీయో పోషిస్తుంది సమ్మెచేసిన కాలంలో. కాని తను సమ్మె చేస్తే? ఎవడికీ యిక్కడ వుద్ధరింపు? మరు క్షణంలో ఎండిన బొమికల పోగులు ప్రదర్శించుకుంటూ వంద మందినిరుద్యోగులు తయారవుతారు...ప్రస్తుతం వుద్యోగం మానేస్తే, మళ్లీ యింకో కంపెనీలోయే ఐదువందలో డిపాజిట్టు కట్టాలి. ఎక్కడ నుంచి తెస్తాడు? అసలు వుద్యోగం ఎవరిస్తారు యిక్కడ మానేస్తే? ఈ మేనేజరు నాగయ్య అందరికీ "ముందు జాగ్రత్త మంచిదని" వూళ్లో వున్న డిస్ట్రిబ్యూటింగ్ కంపనీ మేనేజర్లందరికీ తంతివార్త అందజేసాడు. ఈ ఘోర పరిస్థితిలో ఏంచేయగలడు? ఒక్కటే మార్గం...మళ్లీ వుద్యోగం కొనసాగించటమే.

సాయంత్రం నాలుగైంది. స్నానం చేశాడు. ఎప్పుడూ లేనిది, టోపీ పెట్టాడు. కాఫీతాగి, ఆఫీసుకు బయలు దేరాడు. దారిలో ఒక డజను చక్కెర కేళీలు కొని తీసుకువెళ్లాడు గుమ్మంలో జవానుకో పండిచ్చాడు. వాడొక్కడే మొన్న సాయంత్రం యీ సంఘటన కళ్లారా చూచింది. కొంత సహాయం కూడా చేశాడు మేనేజరుకి. సరాసరి ఆఫీసు గదిలోకి వెళ్లి వొంగి నమస్కరించి, టేబుల్ మీద పళ్లు పెట్టాడు. నాగయ్య కొంచెం తలెత్తి చూశాడు. "బుద్ధికలిగి వుండు. వెధవడబ్బు శాశ్వతమా? ఎందుకు తిన్నావు హోటలువాళ్ల దగ్గర అంచం? పైగా "కలెక్షన్" తక్కువొచ్చిందని నా దగ్గర దబాయిస్తావా, రాస్కెల్. వొళ్లు దగ్గర పెట్టుకో" అని కోపంతో విసుగ్గా నాలుగు ముక్కలు విసిరి పారేశాడు నోట్లోనుంచి. స్కూల్ ఫైనలు మూడుసార్లు యింగ్లీషులోనే తప్పటంచేత, మేనేజరు నాగయ్య నోటినుంచి అద్భుతమైన యింగ్లీషు తిట్లు వెలువడ్డాయి.

"చిత్తం. బుద్ధి గడ్డితింది...పొరపాటు... తమరి ఆఫీసు వొదిలి ఎలా పోగలను? తమరే నాకుగతి" అని పొర్లుకొస్తూవున్న దుఃఖాన్ని, బాధను, అణచుకుని, లేని చిరునవ్వు తెచ్చుకుని మళ్లీ నమస్కరించి, "చిత్తం...యివాళ యేవ్వరైనా పంపిస్తారా? ఏదైనా పిక్చరుందా మనది?" అని వెంట వెంటనే ప్రశ్నించాడు.

"ఆఁ మరే ..వున్నది. ఒక హిందీస్టంటు పిక్చరుంది. కైకలూరు వెళ్లాలి. పో. సాయంత్రం ఆరింటికి కనపడు." అని విసుక్కున్నాడు.

గుమాస్తా గోవిందం సంతోషంతో బయట కొచ్చాడు అంతా మరిచిపోయి.